క్లుప్తంగా

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి..



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: మండలంలోని దంతలబోరు, ఎస్సీకాలనీ, రంగాపురం, నారాయణరావుపేట, నాగారం, జగన్నాథపురం, తోగ్గూడెం తదితర గ్రామాల్లో శుక్రవారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయా సమావేశాల్లో నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, బరపటి వాసుదేవరావు, మహేష్, బాదర్ల జోషి, ఎస్వీఆర్కే.ఆచార్యులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

సింగరేణి(కొత్తగూడెం): స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం బలంగా ఉన్న స్థానాల్లో పోటీ చేస్తుందని, పార్టీ విధానం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎన్నికలు సాధనంగా ఉపయోగించుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాల అభివృద్ధికి అంకితమై పనిచేస్తున్న సీపీఎంకు ఓటు వేసే విధంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

పేదలకు న్యాయం అందించండి..



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: ప్రజలకు సకాలంలో న్యాయం జరిగేలా అడ్వకేట్లు కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం టేకులపల్లి సెంటర్‌లోని గుడిపూడి మోహన్‌రావు కాంప్లెక్స్‌లో సీనియర్ న్యాయవాది తోటకూరి శ్రీనివాస్‌రావు కార్యాలయాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ నిరుపేదలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరం లక్ష్మి, కోరం సురేందర్, ఉమా, లక్కినేని సురేందర్, దళపతి శ్రీనివాస్‌రాజు, గుడిపూడి మోహన్‌రావు, గుడిపూడి సత్యనారాయణ, తోటకూరి ఉపేందర్, లక్ష్మి, సంధ్య స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా సంబురాలు



కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీలో రావణ దహనం



రావణదహనాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



జూలూరుపాడులో అమ్మవారి ఊరేగింపు



ఇల్లెందురూరల్: గ్రామోత్సవంలో అమ్మవారు



సుజాతనగర్: పూజలో పాల్గొన్న భక్తులు



టేకులపల్లి: రథంలో జగదాంబదేవి అమ్మవారి ఊరేగింపు



దసరా సందర్భంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారిని భక్తులు వివిధ రూపాల్లో పూజించారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో గురువారం విజయదశమి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, శమీపూజ, హోమాలు నిర్వహించి, పాలపిట్ట దర్శనం చేసుకుని తరించారు. వివిధ వాహనదారులు వాహనాలకు పూజలు చేయించారు. పోలీస్ స్టేషన్లు, పారిశ్రామిక వాడల్లో ఆయుధపూజ నిర్వహించారు. ఆలయాల సమీపంలోని ప్రాంగణాల్లో సాయంత్రం రావణదహనం కార్యక్రమానికి స్థానిక భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై వీక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): శమీపూజలో పాల్గొన్న ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి



జూలూరుపాడు: పాపకొల్లు బొడ్రాయి సెంటర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



టేకులపల్లి: మేరామా భవానీ ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు, యువతులు



కొత్తగూడెంటౌన్: పంతులుతండాలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ఇల్లెందురూరల్: అమ్మవారికి పూజ చేస్తున్న మహిళలు



జూలూరుపాడు: పాపకొల్లులో అన్నదానం ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ఇల్లెందురూరల్: వివిధ వేషధారణలతో కళాకారులు



టేకులపల్లి: బోడు గ్రామంలో జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కొత్తగూడెంటౌన్: రామవరంలో రావణదహనం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు

బీఆర్‌ఎస్‌ను వీడిన లక్కినేని సురేందర్

టేకులపల్లి: బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు బీఆర్‌ఎస్‌ని వీడి తిరిగి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో లక్కినేనికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు భూక్యా రాజా కూడా పార్టీలో చేరారు.

సమస్యలు పరిష్కరించండి..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఉపయోగించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కిన్నెరసాని, కరకవాగు గ్రామాల్లో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలు, 15వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.

బాపూజీకి నివాళి



సూపర్‌బజార్(కొత్తగూడెం): గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మహాత్మాగాంధీ బాటలో ప్రతీఒక్కరు నడవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతిని విద్యా సంస్థల్లో, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు హైస్కూల్‌లో.. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు



టేకులపల్లి లైబ్రరీ వద్ద..



పాల్వంచరూరల్: మున్సిపల్ కార్యాలయంలో



సుజాతనగర్: నివాళులర్పిస్తున్న నాయకులు

హామీలను విస్మరిస్తున్న 'సింగరేణి'

- కార్మిక ప్రాంతాల్లో మాజీ కార్మికులు నివసిస్తున్న క్వార్టర్లు వారికే కేటాయించాలి
- సీఎస్సార్ నిధులతో కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి



సింగరేణి సీఎండీతో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాపిత 11 ఏరియాల్లో కార్మికులు నివాసముంటున్న కంపెనీ క్వార్టర్లను ఆయా ప్రాంతాల్లో నివాసముంటున్న మాజీ కార్మికులకే కేటాయించాలని, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని అభ్యర్థిస్తున్నారు.

అదేవిధంగా బొగ్గు గనుల్లో బొగ్గు నిక్షేపాలు తవ్వి, పూర్తయిన తరువాత ఆయా ప్రాంతాలను వదిలి వేయటం వలన, అవి బొందలగడ్డలుగా మారి, జనావాసాలు లేక వెలవెలపోతున్న నేపథ్యంలో సింగరేణి సంస్థ సీఎస్సార్ ఫండ్స్ కేటాయించి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధానంగా రోడ్లు, మౌలిక వసతులు, ఆయా ప్రాంతాల బస్టాండ్లను రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కంపెనీ తీసుకోవాలని కోరుతున్నారు. సింగరేణి సంస్థ ఓసీల విస్తరణ సమయంలో నిర్వహించే పబ్లిక్ హియరింగ్‌లో ఇచ్చిన హామీలను సైతం విస్మరిస్తోందని వాపోతున్నారు. ప్రధానంగా ఓసీలలో స్థానిక యువతకు 80శాతం ఉపాధి కల్పిస్తామని నమ్మబలికి ఆ తరువాత గాలికొదిలేస్తోందని నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐటీ హబ్ ఏర్పాటుకు కృషి చేస్తా..



సింగరేణి ప్రాంత నిరుద్యోగుల కోసం ఐటీ హబ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రితో చర్చిస్తా. అదేవిధంగా సంస్థ విస్తరించిన 11 ఏరియాల్లో సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేయిస్తా. దీంతోపాటు బొగ్గు నిక్షేపాలు నిండుకున్న ప్రాంతాలను సింగరేణి దత్తత తీసుకోవాలి.

– కే.సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

హామీలు అమలు చేయాలి..



సింగరేణి సంస్థ ఓసీల విస్తరణ, నూతన ప్రాజెక్టుల ఏర్పాటు సమయంలో నిర్వహించే పబ్లిక్ హియరింగ్ హామీలు అమలు చేయాలని, దీనిలో భాగంగా ఓసీలలో స్థానిక యువతకు 80 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలి. బొందల గడ్డలుగా మారుతున్న కార్మిక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.

– ఎస్. సంజీవ్(ఐఎఫ్‌టీయూ రీజియన్ కార్యదర్శి

యువతకు ఉపాధి కల్పించాలి..



స్థానికంగా నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. కొత్త పరిశ్రములు లేవు, మూతపడిన పరిశ్రమలు తెరిపించేవారు లేరు. ఎన్నికలప్పుడు నాయకులు హామీలు ఇస్తున్నారు. గెలిచిన తరువాత మరిచిపోతున్నారు. ప్రభుత్వం స్థానిక యువతకు ఉపాధి మార్గాలను అన్వేషించాలి.

– కోటాశివశంకర్, విద్యార్థి సంఘం నాయకుడు

వేలం వేయరా..?

- అటవీశాఖకు దొరికితే అంతే సంగతులు
- ఎండకు ఎండి వానకు తడుస్తున్న వాహనాలు
- తుప్పు పట్టి ఏళ్లగా చెట్ల కిందనే



కలప డిపోలో తుప్పు పట్టిన వాహనాలు

ఇల్లెందు: అటవీశాఖకు దొరికిన వాహనాలన్నీ తుప్పు పడుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా వేలం వేయటం లేదు. టెండర్ నిర్వహించకపోవడంతో అటవీశాఖకు దొరికిన వాహనాలతో ఆదాయం రాకుండా పోతోంది. ఒకటి కాదు, రెండు కాదు పదుల సంఖ్యలో ఉన్న వాహనాల ద్వారా వచ్చే ఆదాయం ఖజానాలోకి రాకపోగా.. ఈ వాహనాలకు ఇప్పుటికిప్పుడు టెండర్ నిర్వహించినా పాతఇనుముకు వెళ్లిల్సిందే. అక్రమంగా కలప రవాణా చేస్తూ అటవీ శాఖకు దొరికిన వాహనాలు ఎందుకు పని రాకుండా తుప్పు పడుతున్నాయి. ఇల్లెందు డివిజన్ అటవీ ప్రాంతం నుంచి విలువైన టేకు, వేగీస, జిట్రేగు, నారవేప లాంటి కలపను స్మగ్లర్లు తరలించుకుపోతున్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు అటవీశాఖ నిఘా పెట్టి పటుకున్న వాహనాలు డిపోలో తుప్పు పడుతున్నాయి. వెహికల్ ఇన్‌స్పెక్టర్, అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయటంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. అక్రమంగా కలపను తరలించే వాహనాలు పట్టుపడితే జరిమానా విధించి వదిలేయటం ఒక తంతు. ఇక పట్టుబడిన వాహనం మూడు నెలల లోపు యజమాని వాహనాన్ని తీసుకెళ్లేందుకు రాకపోతే ఆ వాహనం కండీషన్‌ను పరిశీలించి విలువ అంచనా వేసి టెండర్‌కు అప్పగించటం మరో తంతు. ఇలా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయటం మూడో తంతు.

ఇల్లెందు డిపోలో రెండు జిల్లాల వాహనాలు..

కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం కేంద్రంగా కలప డిపోలు ఉన్నాయి. ఇల్లెందు డిపోలో కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని ప్రాంతాల్లో దొరికిన వాహనాలు కూడా ఇల్లెందు డిపోలోనే మూలుగుతున్నాయి. ఆ వాహనాలకు టెండర్ నిర్వహించటం లేదు. కొన్ని అటవీశాఖ పరిధిలో ఉంటే మరికొన్ని కోర్టు పరిధిలో ఉండటం వల్ల అన్ని వాహనాలకు టెండర్ ఏర్పాటు చేయలేకపోతున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. డిపోలో ఉన్న వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిచి తుప్పు పట్టిపోతున్నాయి. ఇటు యజమాని రాకపోగా, అటు టెండర్ వేసి మరో యజమానికి అప్పగించకపోవటంతో విలువైన వాహనాలు నిరుపయోగమైపోతున్నాయి. ఇల్లెందు అటవీశాఖ డిపోలో 20 ట్రాక్టర్లు, నాలుగు ఫోర్ వీలర్స్ వాహనాలు, 40 బైక్‌లు, ఎడ్ల బండ్లు ఎండకు ఎండి, వర్షానికి తడిచిపోతున్నాయి. ఏళ్లు గడిచినా వీటిని కదిలించక ఇనుప సామానుకు అప్పగించేందుకు కూడా పనికి రాకుండా పోతున్నాయి. అటవీశాఖ అధికారులు చొరవ చూపితే మూడు నెలలకోసారి టెండర్ పెడితే ఎంతోకొంత ఆదాయం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

వేతనాలు అందని వాచర్‌లు..

కలప డిపోలలో పనిచేసే వాచర్లకు ఆరు నెలలుగా వేతనాలు అందటం లేదు. ఇక్కడి డిపో ఇన్‌చార్జ్ అందజేసే హాజరుతో రేంజర్ కార్యాలయం నుంచి జిల్లా అటవీశాఖ కార్యాలయానికి వేతనం కోసం బిల్లు పంపిస్తే మూడు నెలలు, ఆరు నెలలకోసారి బడ్జెట్ విడుదల అవుతుంది. జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం డిపోలలో ఇద్దరు చొప్పున ఆరుగురు వాచర్లు ఉన్నారు. అందరికీ ఆరు నెలలుగా వేతనాలు లేవు. కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాచర్లు ఆవేదన చెందుతున్నారు.

జీతాలు విడుదల కాలేదు..



డిపోలలో పని చేసే వాచర్లకు ఆరు నెలలుగా వేతనాలు అందటం లేదు. కుటుంబాలు గడవటం చాలా కష్టంగా ఉంది. ఆరు నెలలకోసారి వేతనాలు అందితే ఏదైనా జబ్బు చేస్తే ఆస్పత్రికి వెళ్లడానికి చేతిలో చిల్లి గవ్వ ఉండటం లేదు. అధికారులు స్పందించాలి.

– శ్రీను, వాచర్, ఇల్లెందు

టెండర్ మా చేతుల్లో లేదు..



కలప డిపోలో వాహనాల టెండర్ మా చేతుల్లో లేదు. ఆర్టీఓ స్థాయి నుంచి వాహనాలు చెక్ చేసి టెండర్లకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కోర్టు కేసుల్లో ఉండటం వల్ల తీర్పు వచ్చే చర్యలు తీసుకునే అవకాశం లేదు. వాచర్లకు వేతనాల బడ్జెట్ రాగానే అందజేస్తాం..

– చలపతిరావు, ఎఫ్ఆర్ఓ, ఇల్లెందు